# నువ్వు మాట్లాడేదేమిటి?

ఎడంచేత్తో పుస్తకం పట్టుకుని చదువుతూనే కుడిచేత్తో ముక్కలు వేయిస్తోంది మాలతి.

"ఆ! అదీ శ్రద్ధంటే! వంట ఎలా తగలబడినా, వంట చేస్తూకూడా చదువు చదువుకోవాలి!" వెటకారంగా నవ్వుతూ దీర్ఘాలుతీసింది పెద్దాడబిడ్డ రుక్మిణి.

"అవును మరి! ఎక్కడో ఏ గదిలోనో చదువుకుంటే నలుగురూ ఎలా చూస్తారు? తన గొప్ప నలుగురికి తెలియద్దూ!" వంకరనవ్వులు నవ్వింది రెండో ఆడబిడ్డ ధనలక్ష్మి. "అదికాదర్రా! ఇలా అయితే చూసినవాళ్ళు 'పాపం, ఈ ఇంటికోడల్ని పుస్తకంకూడా పట్టుకో నియ్యకుండా ఎంత ఆరడి పెడుతున్నారో!" అని జాలిపడతారు. మనం మాత్రం చదువుకోమూ! ఇలా వంటింట్లోనూ, అటకల మీదా,

స్నానాల గదుల్లోనూ పుస్తకాలు పుచ్చుకు పోజులు కొడతా మేమిటి?"

ఘొల్లున నవ్వులు......

నోరుగల నలుగురు మంచిని చెడ్డగా చూపించి అపహాస్యాలు చెయ్యగలరు.

నోరెత్తలేని మంచి నిస్సహాయంగా అణగిమణిగి పోతుంది.

ఇదెక్కడి లోకన్యాయం?

ఇంకా నవ్వుతున్నారు వాళ్ళు!

మంచిని చెడుగా చూపి పరిహసించగల నోరున్న వాళ్ళ నవ్వులు!

భరించలేక పోయింది మాలతి.

గృహిణిగా ఆడబిడ్డలకూ, ఆడబిడ్డల ఆడబిడ్డలకూ సకల సేవలూ చేస్తోంటే, ఇదా, తనకు దక్కే ప్రతిఫలం? తనకు ఎలా అనుకూలమో అలా చదువుకోవడంకూడా మహాపరాధమా?

ప్రసాద్ ఇంటికిరాగానే జరిగినదంతా చెప్పి.

'నాతప్పేమీ లేకపోయినా, ఇలా అవమానిస్తోంటే సహించలేను' అంది.

ప్రసాద్ సరిగ్గా వినిపించుకోకుండానే 'పోనీ, చదవటం మానెయ్యరాదు?' అన్నాడు.

మాలతికి చాలా కష్టంతోచింది.

'ఒకరి యిష్టా యిష్టాల ప్రకారం నన్ను నేను ఎందుకు మార్చుకోవాలి? నా అలవాట్లవల్ల ఎవరికీ ఏ విధమయిన అపకారమూ జరగటం లేదుగా?'

'అబ్బ! వెధవగొడవ! నోరు మూసుకో!' అని కసిరాడు ప్రసాద్.

మాలతి మనసు ఉక్రోషంతో ఉడికి పోసాగింది. ఆ రాత్రి భోజనాల దగ్గర మాలతి వడ్డిస్తోంటే రుక్మిణి అదో రకంగా గొంతుమార్చి 'ఇవాళ మాలతి ఎవరో వీరభద్రం గారింటికి వెళ్ళిందిరా! ఎందుకు వెళ్ళిందో? ఏమిటో?' అంది.

మాలతి ప్రమాన్పడి నిలబడిపోయింది. ప్రసాద్ విరగబడి నవ్వాడు. రుక్మిణికి మండిపోయి 'అలా నవ్వటం కాదురా? ఇవ్వాళ ఇక్కడికి, రేపు మరోచోటికి. ఇలా తిరుగుళ్ళు నేర్చిందంటే ఇంటి పరువేం కావాలి?'

మిగిలిన అందరు నవ్వులు! మంచిని చెడుగా చూడగలిగే నోరుగలవాళ్ళ నవ్వులు!

ప్రసాద్ నవ్వు ఆపి 'అక్కయ్యా! ఆ వీరభద్రంగారు ఎనభై యేళ్ళు నిండిన పండువృద్ధు. ఆయన భగవద్గీత

చక్కగా వ్యాఖ్యానించి చెపుతారని వెళ్తుంది మాలతి. కావాలంటే నువ్వూ వెళ్ళు' అన్నాడు.

రుక్మిణి అప్పటికయినా తన తప్పు గుర్తించక 'ఏమో నాయనా! మూడు ముస్తాబులూ అయివెళ్తుంటే- ఎవరో, ఏమిటో అనుకున్నాను. అయినా నాకు తెలియక అడుగుతాను, అంత షోకు చేసుకుంటేకాని, భగవద్గీత బోధపడదా?' అంది.

మళ్ళీ నవ్వులు!

మాలతి మనసు రగిలిపోయింది.

'వదినగారు! అనవసరంగా కొంపలు తీసే మాటలు మాట్లాడకండి- బయటికి వెళ్తూ కాస్త శుభ్రమైన చీర కట్టుకుని తల దువ్వుకుంటే, సింగారించుకోవటమా? ఈ వయసులో మీరు మూడు ముస్తాబులూ అవటంలేదూ?'

రుక్మిణి వేంటనే దుర్భాషలతో ఏడుపు ప్రారంభించింది.

'చూశావా! ఎన్నెన్ని మాటలంటుందో? నేను కొంపలు ముంచుతున్నానా? సాని పాపలా తిరుగుతున్నానా?'

'మాలతీ!' గర్జించాడు ప్రసాద్.

ఇంత జరిగినా భర్త తన అక్కగారి తరఫున తనను గద్దించటం భరించలేక పోయింది మాలతి.

"నేనేం చేశానండీ! ఆవిడ......"

మాలతి మాటలు పూర్తి కానియ్యలేదు ప్రసాద్.

"ఆవిడ మా అక్క. తన ఇష్టం వచ్చినప్పుడు మాట్లాడుతుంది. నువ్వేమిటి మాట్లాడేది!"

తింటోన్న పెరుగు అన్నంలో చెయ్యి కడిగేసుకు లేచి పోయిన రుక్మిణిని ఓదార్చటానికి వెళ్ళిపోయాడు ప్రసాద్.

మాలతి మనసు ముక్కలై పోయింది. ప్రసాద్ తనను ఎన్నితిట్టినా, చివరకు కొట్టినా సహించి ఉండగలదేమో!

కానీ, తను మనిషే కానట్లు, తన కసలు వ్యక్తిత్వం లేనట్లు 'నువ్వు మాట్లాడేదేమిటి?' అని ఈసడిస్తున్నాడు. చీని చీనాంబరాలు అక్కర్లేదు. పంచ భక్ష్య పరమాన్నాలు అక్కర్లేదు. కానీ తన నసలు మనిషిగా చూడకపోతే ఎలా భరించటం?

ఆ రోజే ఇంట్లోంచి వచ్చేసి ఒక ఆఫీసులో క్లర్కుగా జాయినయింది మాలతి. ఇంట్లోంచి వచ్చేసినందుకు మనసు ఏదో బాధతో విలవిలలాడేది. 'కనీసం, ఆత్మాభిమానంతో బ్రతక గలుగుతున్నాను' అని తనను తను ఓదార్చుకునేది.'

ఆఫీసులో రాధవ్రాసే ఫైల్సనిండా స్పెల్లింగ్ మిస్టేక్సే.

'అబ్బా! ఈవిడ బి. ఏ. పాసయింది మళ్ళీ! ఇన్ని

స్పెల్లింగ్ మిస్టేక్స్ ఏమిటీ?' పక్కనున్న నళినితో ఒకనాడు అన్నది. ఆ మరునాడే రాధ మాలతిమీద విరుచుకు పడింది.

"ఏయ్! ఏమిటి? తిక్క తిక్కగా మాట్లాడుతున్నావుట? నాకసలు చదువే రాదనీ, ఎలాగో డిగ్రీ సంపాదించాననీ అన్నావుట! మొగుణ్ణొదిలి యిష్టం వచ్చినట్టు ఊరిమీదపడి ఊరేగుతూ నాకు వంకలు పెడతావా?"

తెల్లబోయింది మాలతి. తాను అన్న మాటలకు ఇంత వికృతరూప మెవరిచ్చారు? నళిని కల్పించిందా? లేక రాధే అహంకారంతో ఆడిపోసుకుంటోందో?

వీధినల్లాల దగ్గర అప్పలమ్మలు దెబ్బలాడు కుంటున్నప్పుడు విషయం ఏదయినా, వివాదం ఎలా ప్రారంభమయినా "నీకు ఇంతమంది......" అంటే "నీకు అంతమంది......" అనుకునే స్థాయిలోకి దిగిపోతారు క్షణాలలో ...... ఆడవాళ్ళు ఎంత చదువుకున్నా. ఉద్యోగాలు చేస్తున్నా, ఆస్థాయినుంచి బయట పడలేక పోతున్నారా? తను 'స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నాయి' అంటే 'మొగుణ్ణొదిలి ఊరుమీదపడి ఊరేగుతున్నావు' అని సమాధానం చెపుతుందేమిటి?

నళిని తనకు రాధమీద బోలెడు బోలెడు చెప్పింది. ఆ ధైర్యంతోనే తను రాధ గురించి ఒకమాట అంది నళినితో ఇప్పుడు రాధ తనను ఎడాపెడా తిట్టి పోస్తోంటే, రాధ పక్క జేరి నవ్వుతోంది నళిని.

సైపు చేస్తోన్న మాలతికి అకస్మాత్తుగా తలతిరిగింది- క్రింద పడబోయింది- రాధ, నళినీ తమాషా చూస్తూ కూచు న్నారు కోమలలేచి మాలతి దగ్గరకు రాబోయింది కాని, రాధ ఉరిమి చూసేసరికి ఆగిపోయింది. రామారావు ఊరుకో లేక మాలతి దగ్గరగావచ్చి 'ఏం జరిగిందండి?' అన్నాడు.

'ఏమో! ఎందుకో తల తిరుగుతోంది. కూచోలేక పోతున్నాను-' అని టేబిల్ మీద తల వాల్చేసింది మాలతి.

'ఆటోలో మీ ఇంటికి వెళ్ళిపొండి -' అన్నాడు రామారావు అనటమే కాదు- ప్యూన్‌ని పంపి ఆటోని కూడా పిలిపించాడు. తన సీట్‌లోంచి లేవబోతూ మళ్ళీ తూలింది మాలతి.

'మీరు ఒక్కరూ వెళ్ళగలరా? పోనీ, నేనూవచ్చి మిమ్మల్ని ఇంటిదగ్గర దింపివస్తాను-' అని తనూ బయలు దేరాడు రామారావు. 'వద్దు' అనటానికి కూడా ఓపిక లేక పోయింది మాలితిలో-

"ఏం జబ్బు?"

"వేవిళ్ళేమో!"

"మొగుణ్ణొదిలేసిందిగా!"

"బాగుంది! మొగుణ్నొదిలేస్తే వేవిళ్ళు రాకూడదా?'

ఘొల్లున నవ్వులు-

తల తిరుగుతోన్న మాలతి కానప్పులు వినిపించ లేదు. కాని, రామారావుకు బాగానే వినిపించాయి. మాలతి పక్కన నడుస్తోన్న అతనికి భూమిలోకి కూరుకు పోతున్న ట్లుగా అనిపించసాగింది. అయినా ఆ నిస్సహాయ స్థితిలో 'మాలతిని వదిలెయ్యటానికి అతని మానవత్వం అంగీక రించక, మాలతిని ఇంట్లోదింపి డాక్టర్‌ని తీసుకొచ్చాడు. మాలతికి అంతకుముందు మంచి జ్వరంగా ఉండి, లక్ష్యపెట్ట కుండా అఫీసుకి వచ్చినట్లుంది. అంచేత జ్వరతీవ్రత హెచ్చింది పని మనిషితప్ప మరెవ్వరూ సాయంలేరు మాలతికి. అంచేత సానుభూతితో ఆఫీస్‌కి వెళ్తున్నప్పుడూ, మాలతికి యెలా ఉందో కనుక్కుంటూ మాలతికి కావలసిన మందులు తెచ్చి పెట్టాడు రామారావు. రెండు రోజుల్లోనే మాలతి కోలు కుంది.

"మీకు చాలా థేంక్స - నాకు చాలా సహాయం చేశారు-' అంది.

"వద్దు నాకు థేంక్స చెప్పకండి. రేపటినుండి నేను మీ యింటికిరాను. మన ఆఫీస్‌లోవాళ్ళు మనను గురించి చాలా చాలా అనుకుంటున్నారు."

మాలతి వంచినతల యెత్తలేకపోయింది.

"నేను నిష్కారణంగా రాధతో వివాదం తెచ్చు కున్నాను.

బహుశః అందుకే ఇలా మాట్లాడు తున్నారు."

"ఎంత పిచ్చివారండి! అది వాళ్ళ స్వభావం! స్నేహం లోను, శత్రుత్వంలోనూ వాళ్ళు అలాగే ప్రవర్తిస్తారు. స్నేహంలో మనిషి వెనుక గుసగుసలాడుకుని ఆనందిస్తారు. శత్రుత్వంలో ముఖం మీద కూడా అంటారు. అంతే తేడా! తాము ఎంతవెకిలిగా, వెర్రిమొర్రిగా మాట్లాడినా, అదంతా హాస్యం! ఎదుటివాళ్ళు భక్తి గౌరవాలతో నమస్కారం చేసినా, అది మదపిచ్చి, తాము ఎవరితో తిరిగినా, ఎక్క డెక్కడ తిరిగినా అదంతా డిగ్నిటీ? యెదుటివాళ్ళు గుమ్మ మైనా కదలకపోయినా, యెప్పుడో పూర్వ జన్మలోనయినా, ఏదో చేసేవుంటారనే నిర్ధారణ! ఆడవాళ్ళు యెంత చదువు కున్నా అప్పలమ్మలేనని నిరూపించే ఇలాంటి ఆడవాళ్ళు వున్నంతవరకూ స్త్రీ జాతికి అభ్యుదయమేమిటండీ! వస్తాను. మీ మహిళామణుల మధ్య ఈ మొగ మానవమాత్రుడు గెలవలేడు.

"రాధలాంటి వాళ్ళకి భయపడి మాలతి రామారావును తలెత్తికూడా చూడకపోయినా, విషపునవ్వులకు, వంకర మాటలకూ గురికాక తప్పలేదు మాలతి. జ్వరం తగ్గినా నీరసంగా ఉండటంవల్ల ఒకరోజు ఆఫీసుకి ఆలస్యంగా వచ్చింది మాలతి,

"ఇప్పుడా రావటం? యెందుకమ్మా, ఇంత ఆలస్యం?" హేళనగా అంది రాధ.

"మనకంటే మొగుడూ పిల్లలు, తాపత్రయాలూ- ఈవిడకు ఏ బాదరబందీ లేదుకదా! ఈవిడకెందుకో ఆల స్యం?" ఆశ్చర్యపోయింది నళిని.

వందుకు తిన్నమ్మకి ఒకటే కూర! అడుక్కుతినే అమ్మకి......" అర్ధోక్తిలో ఆపి నవ్వింది రాధ-

అందరూ ఘొల్లున నవ్వులు!

మంచిని చెడ్డగాచూప గలిగిన నోరు గలవాళ్ళ నవ్వులు!

ఆ తరువాత ఒకరోజున రాధ చాలా ఆలస్యంగా వచ్చింది. మాలతి ఊరుకోలేక "ఆ రోజున నన్ను అన్నావ్! మరి ఈ రోజున నువ్వెందుకు ఆలశ్యంగా వచ్చావ్?" అంది-

రాధ నిటారుగా నిలబడి మాలతిని పురుగుని• చూసినట్లుగా చూసింది పొగరుగా, అహంకారంగా, దర్పంగా అంది—

"నేను నా యిష్టం వచ్చినప్పుడు వస్తాను-- నువ్వ మాట్లాడే దేమిది?"

చేష్టలుడిగి కూర్చున్న మాలతి దగ్గరికి కోమలవచ్చి రహస్యంగా "ఆవిడ మేనేజర్ గారి కజిన్ సిస్టర్. ఆవిడతో తగువు పెట్టుకోకండి-" అంది.

అంతవరకూ అర్థంకాని విషయాలన్నీ అప్పుడు అర్థమయ్యాయి మాలతికి.

ఇల్లు వదిలి వచ్చాక ఎన్ని అవస్థలు ఎదుర్కోవలసి వచ్చినా ఆత్మాభిమానంతో బ్రతుకుతున్నానని తృప్తిపడుతోంది ఇన్నాళ్ళూ! ఈనాడు తనకు మిగిలిందేమిటి?!

"నువ్వు మాట్లాడేదేమిటీ?"

అదే! అదే! దీనినుండి పారిపోవాలని భగీరథ ప్రయత్నం చేస్తోంది, అదే ఎదురై వచ్చి నిలుస్తోంది.

ఆ ఊళ్ళో "స్వాతంత్ర్య మహిళ" అని ఒక మహిళా సమాజం ఉన్నట్లు విని స్త్రీ జనాభ్యుదయమే దాని ధ్యేయమని అందులో చేరింది మాలతి. ఆ మహిళా సమాజం అధ్యక్షురాలు కామాక్షమ్మ కళ్ళజోడు సవరించుకుంటూ మాలతినిచూసి 'శభాష్! చాలా మంచి పని చేశావమ్మా! మన ఆత్మాభిమానం కాపాడుకోవటంకోసం మనం అవసరమయితే సంసారాలయినా వదులుకోవాలి. అప్పటికికాని, స్త్రీ జాతికి మోక్షం లేదు' అంది. ఇన్నాళ్ళకు తను చేసిన పని మెచ్చుకుంటోన్న వ్యక్తి ఎదురయినందుకు పొంగిపోయింది మాలతి- కొన్నిరోజులు బాగానే గడిచాయి. రోజూ సాయంత్రం సమాజానికి తప్పని సరిగా వెళ్ళివస్తుండేది మాలతి.

"కాలం మారింది- స్త్రీ జాతి అభ్యుదయాన్ని సాధిస్తోంది" అనుకునేది తనలో తాను- అనుకుని ఎంతో ఆనందించేది.

ఒకరోజు 'మిసెస్ రామేశ్వరరావు ఇంకా రాలేదేమో!' అంది యశోద-

"ఏమో మరి! ఈవిడ ఉద్యోగం చేస్తోంటే, ఆయన ఇంట్లోకూచుని పిల్లల్ని ఆడిస్తాడుగా! ఇంకాఎందుకురాలేదో?"

ఘొల్లున నవ్వులు!

మంచిని చెడుగాచూసే నోరుగలవాళ్ళ నవ్వులు!

బిత్తరపోయింది మాలతి- ఇక్కడ కూడా ఇంతేనా? యెక్కడదాక్కున్నాయి మరి, అభ్యుదయ భావాలు? భార్యా భర్తలు పరస్పర సహకారంతో ఉద్యోగాలు చేసుకోవటం ఇంత పరిహాసా స్పదమైన విషయమా?

మహిళా సమాజం వార్షికోత్సవానికి సంబంధించిన విషయాలపైన చర్చలు సాగుతున్నాయి. వార్షికోత్సవానికి చీఫ్ గెస్ట్‌గా మంత్రిగారిస పిలుద్దామంది కామాక్షమ్మ. అందరూ గొర్రెలమందలా తలలూపారు. మాలతిమాత్రం లేచి నిలబడి "మన వార్షికోత్సవానికి మంత్రి గారెందుకు? యెవరైనా ప్రముఖ మహిళను పిలుద్దాం!" అంది.

కామాక్షమ్మ తన కళ్ళద్దాల్లోంచి మాలతిని నమిలి తినేస్తున్నట్లు చూస్తూ "కూచో! నువ్వు మాట్లాడేదేమిటీ?" అంది.

నిలబడిన చోట మంచుబొమ్మలా గడ్డ కట్టుకుపోయింది మాలతి.